క్లుప్తంగా

ఘనంగా అయ్యంకి జయంతి



యండగండిలో అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉండి: జాతీయ గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 133వ జయంతి వేడుకలను ఉండి మండలం యండగండి శాఖా గ్రంథాలయంలో సోమవారం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఎస్.రామకృష్ణ ఆధ్వర్యంలో వెంకటరమణయ్య చిత్రపటానికి విద్యార్థులు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేగేశ్న సత్యరాజ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోఆపరేటివ్ బ్యాంక్ కార్యదర్శి సీహెచ్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరం మండల శెట్టిబలిజ కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన శెట్టిబలిజ సంక్షేమ సంఘం నాయకులు

వీరవాసరం: శెట్టిబలిజ సంక్షేమ సంఘం వీరవాసరం మండల కమిటీ నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని సంఘ నాయకులు సోమవారం తెలిపారు. శెట్టిబలిజ సంక్షేమం సంఘం మండల అధ్యక్షుడిగా దొంగ వెంకట దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడిగా వేంద్ర దివాకర్, పితాని కోటేశ్వరరావు, మల్లుల శ్రీను, పాల మహేంద్ర, ప్రధాన కార్యదర్శిగా కోడి నరసింహం ,సహాయ కార్యదర్శిగా వీరవల్లి తిరుపతి వెంకటేశ్వరరావు, వీరవల్లి ప్రవీణ్‌లను ఎన్నుకున్నమని పేర్కొన్నారు. నూతన కమిటీని రాష్ట్ర నాయకులు దొమ్మేటి సుధాకర్, జక్కం చెట్టి రాజా ప్రసాద్, జోగి పండు, పాల రాంబాబు గూడూరు హనుమంతు, దొంగ దుర్గాప్రసాద్ తదితరులు అభినందించారు.

సీహెచ్‌సీ వైద్య సేవలు భేష్



వైద్య సేవలు పరిశీలిస్తున్న కేరళ వైద్య బృందం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం ఏరియా (సీహెచ్‌సీ) సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు బాగున్నాయని కేరళ వైద్యం బృందం ప్రతినిధి ఓమెన్ మాథ్యూస్ కితాబిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యరంగంలో ఆరోగ్య పథకాల అమలు పరిశీలనలో భాగంగా సోమవారం పీఆర్సీ (పాపులేషన్ రిసోర్స్ సెంటర్ బృందం) భీమవరం సీహెచ్‌సీ సందర్శించారు. ఆస్పత్రిలో పేషెంట్లు, బాలింతలకు అందుతున్న వైద్య సేవలు, నిర్వహణ, రికార్డులను, ఫార్మసీ, ల్యాబ్, డెంటల్ విభాగాలతో పాటు మందులు వినియోగాన్ని వారు పరిశీలించారు. జనాభాకు సరిపడే విధంగా సీహెచ్‌సీకి అవసరమైన వసతులను సమకూర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక సమర్పిస్తామని మథ్యూస్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి ఎమ్మెస్ ప్రసాద్, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.వీరస్వామి, ఎల్‌డీ కంప్యూటర్ పీవీ భాస్కర రావు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి



చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ దాసి రాజు

వీరవాసరం: విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆర్డీఓ దాసిరాజు తెలిపారు వీరవాసరం శివారు యానాదులు కాలనీలో ఉన్న ప్రాంతాన్ని సోమవారం ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి బయట తిరుగుతున్న పిల్లలు ఎక్కువగా ఈ ప్రాంతంలో ఉన్నారని సమాచారం మేరకు ఇక్కడకు వచ్చామన్నారు చదువుకోవడం ద్వారా విద్యార్థితోబాటు ఆ కుటుంబం కూడా అభివృద్ధి దిశలో సాగుతుందన్నారు పాఠశాలకు వెళ్లకుండా ఏ ఒక్క పిల్లవాడు ఉండకూడదని వివరించారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

నరసాపురం రూరల్: నరసాపురం పట్టణంలో ఉపాధి కోసం ఉత్తరప్రదేశ్ నుంచి వలస వచ్చిన ఓ యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్టు పట్టణ ఎస్సై బీఎస్‌డీఆర్ ప్రసాద్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పాతబజార్ సాయిబాబా గుడి సమీపంలో ఓ ఎలక్ట్రికల్ షాపు పైపోర్షన్‌లో అద్దెకు ఉంటున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివం (20) అనే వ్యక్తి టైల్స్ పని చేస్తుంటాడు. అతనితో పాటు వారి ప్రాంతానికే చెందిన మరో ఇద్దరు కూడా ఉంటున్నారు. సోమవారం ఉదయం యథావిధిగా పని నిమిత్తం బయటికి వెళ్లిన శివం సాయంత్రం తనతో ఉంటున్న మిగిలిన ఇద్దరూ వచ్చేసరికి ఉరివేసుకుని మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

యనమదుర్రులో రికార్డు స్థాయి అభివృద్ధి

- నాలుగేళ్లలో సుమారు రూ. 18 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

భీమవరం అర్బన్: మండలంలోని యనమదుర్రు గ్రామంలో గత నాలుగేళ్లలో సుమారు. రూ. 18 కోట్లు లబ్ధిదారులకు, అభివృద్ధి పనులు జరగడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 6 వేల మంది జనాభా కలిగిన గ్రామంలో గతంలో సరైన రోడ్లు, డ్రెయినేజీలు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అంతేకాకుండా స్వచ్ఛమైన తాగునీరు లేకపోవడంతో పొరుగున ఉన్న భీమవరం పట్టణానికి వెళ్లి టిన్నులతో తాగునీరు తెచ్చుకునే వారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అధికారంలోకి రాగానే గత నాలుగేళ్లలో గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించి సీసీ రోడ్లు, పక్కా డ్రెయినేజీలు నిర్మించడం, స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు రక్షిత మంచి నీటి చెరువుల వద్ద ఫిల్టర్ బెడ్‌లు ఏర్పాటు చేశారు. అలాగే నూతన సచివాలయాన్ని నిర్మించి గ్రామ సేవలకు అందుబాటులోకి తీసుకురావడం వంటి ఎన్నో అభివృద్ధి పనులను చేపట్టారు. అభివృద్ధి పనులు, గ్రామంలో అమ్మ ఒడి, రైతు భరోసా, డ్వాక్రా రుణ మాఫీ, వడ్డీ మాఫీ, ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీ మహిళలకు రూ. 18 వేల 750. కాపు మహిళలకు రూ. 15వేలు తదితర వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందిన లబ్ధి రూ. సుమారు 15 కోట్లు చేకూరండంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పశువుల చెరువు వద్ద జరుగుతున్న ఆధునికీకరణ పనులు



శ్రీ శక్తీశ్వర దేవస్థాన శక్తీ గుండం చెరువును ఆధునికీకరించిన దృశ్యం



గ్రామంలో నిర్మించిన పక్కా డ్రెయిన్

వేగం పుంజుకున్న అభివృద్ధి పనులు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించి రూ. 20 లక్షలు, మండల పరిషత్ నుంచి రూ. 15 లక్షలు నిధులు మంజూరు కావడంతో గత మూడు నెలలుగా అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. రూ. 70 లక్షలతో పక్కా డ్రెయినేజీ, సీసీ రోడ్లు, శక్తి గుండం, పశువుల చెరువులు ఆధునికీకరణ పనుల్లో వేగం పుంజుకున్నాయి. ముఖ్యంగా దేగాపురంలో రూ. 35 లక్షలతో చెరువు ఆధునికీకరణ, ఫిల్టర్ బెడ్‌లు నిర్మాణ పనులు జరగడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దాతల సహకారంతో

సుమారు రూ. 70 లక్షలు దాతల సహకారంతో ఎంతో ప్రాశస్త్యం కలిగిన శ్రీ పార్వతి సమేత శక్తీశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గోపురం, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రహారీ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి.

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చొరవతోనే..



ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చొరవతోనే గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఆర్‌బీకే , విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్‌లు నిర్మాణంలో ఉన్నాయి. మా గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు.

– తిరుమల విజయరామ్, ఉప సర్పంచ్, యనమదుర్రు

ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కారం



గ్రామంలో ఏ సమస్య వచ్చిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్తే వెంటనే పరిష్కరిస్తున్నారు. గత నాలుగేళ్లలో సుమారు రూ. 18 కోట్లు అభివృద్ధి, సంక్షేమ లబ్ధి చేకూర్చారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పాలన పట్ల గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

– బద్దా శాంతారామ్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు, యనమదుర్రు

మహిళలకు సర్టిఫికెట్ల అందజేత



మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

కాళ్ల: కుట్టు మెషీన్ శిక్షణలో ఉత్తీర్ణత సాధించిన వారికి బైరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం సర్టిఫికెట్లను అందజేశారు. బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెద అమీరం గ్రామంలో మహిళలకు జీవనోపాధి కల్పించడంలో భాగంగా 2 నెలలు నుంచి కుట్టు శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగింపు సందర్భంగా సోమవారం పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లుఅందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కటారి విశ్వనాథ రాజు, బైర్రాజు ఫౌండేషన్ మెంబర్ వేగేశ్న నర్సింహ రాజు, ముత్య రామ కృష్ణ , బైర్రాజు ఫౌండేషన్ కోఆర్డినేటర్ పెనుమాక భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధికి కృషి

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణంలోని మెంటే వారి తోటలో రూ 15 లక్షలతో నిర్మించనున్న ముస్లిం షాదీఖానాకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యత కల్పించి వారిని అభివృద్ధి చేసే దిశగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. ముస్లిం, మైనార్టీ వర్గాలకు సంబంధించి రాజకీయంగా కూడా అత్యంత ప్రాధాన్యత కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ముస్లిం, మైనార్టీలు కోరిన చోట షాదీ ఖానాలను నిర్మిస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగానే భీమవరానికి సంబంధించి షాదీఖానాను నిర్మిస్తున్నామని అన్నారు. మాజీ సీఎం చంద్రబాబు నాయుడు మాయమాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, చంద్రబాబుతో జతకట్టిన పవన్ కల్యాణ్ తన గ్రాఫ్ ను రోజురోజుకు తగ్గించుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వర రావు, మావుళ్లమ్మ కమిటీ చైర్మన్ మానేపల్లి నాగన్న బాబు, మాజీ కౌన్సిలర్ పాలవెల్లి మంగ, అల్లూరి రాజేష్, నాగవల్లి, కానుబోయిన వెంకటరమణ, నారిన సత్యనారాయణ, తోట రామకృష్ణ, రామిశెట్టి జయసూర్య షేక్ మందూ హుస్సేన్ , సనావుద్దీన్, షేక్ అహ్మద్, మస్తాన్ వలీ, మహబూబ్, షేక్ రబ్బాని, కరీముల్లా, షేక్ సుల్తాన్, ఎండీ సందని, నిజాముద్దీన్, మసుద్దీన్, షేక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



షాధీఖానా శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



దాతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

ఆలయ నిర్మాణానికి రూ.1.50 కోట్ల నిధుల మంజూరు..

సాక్షి, భీమవరం: పట్టణంలో పురాతన దేవాలయమైన శ్రీ రామలింగేశ్వర స్వామి వారి (సుబ్బారాయుడు గుడి) ఆలయ నూతన నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.50 కోట్ల నిధులను మంజూరు చేసిందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. కాగా భక్తుల వంతుగా రూ.50 లక్షల నిధులను సమకూర్చాల్సి ఉన్న నేపథ్యంలో దాతలు రూ. 50 లక్షల నిధులను విరాళంగా ఇవ్వడానికి ముందుకు రావడం ఎంతో అభినందనీయమని అన్నారు. సోమవారం రాత్రి ఆయన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దాతలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయం, సుబ్బారాయుడు గుడి నూతన ఆలయ నిర్మాణానికి సహకరించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపార. అనంతరం దాతలు దివంగత పెనుమత్స సత్యనారాయణ రాజు కుటుంబ సభ్యులను, గుండు వారి కుటుంబ సభ్యులను, గాదిరాజు సుబ్బరాజు, ఏఎస్ రాజు,ం పాత్తూరి బాపిరాజు, ఏవో సుబ్బరాజు, ద్వారక రంగరాజు, రాంకుమార్ రాజు, కె.పి గుప్త, లక్ష పత్రి కమిటీని, గొంట్ల వెంకటనారాయణ, గాదిరాజు సూరిబాబు, డాక్టర్ చేబోలు రవి కిరణ్ తదితర దాతలను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ ఈవో దండు కృష్ణంరాజు, ఈవో తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం

ఆకివీడు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. తెల్లవార్లూ కురిసిన వర్షంతో పాటు సోమవారం కురిసిన వర్షం 13.4 మిల్లీమీటర్లుగా నమోదైంది. ఆదివారం 20 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పంట కాల్వల్లోనూ, బోదెల్లో నీటి మట్టం ఆశాజనకంగా ఉంది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి నారుమడులకు ఏ విధమైన ఇబ్బంది కలుగలేదని వ్యవసాయ సహాయ సంచాలకులు కేఎస్ఎస్. శ్రీనివాసరావు చెప్పారు.

వికలాంగులకు వలంటీర్లతో అండ

నేను చాలా క్రితం ప్రమాదశాత్తు కాలు కోల్పోయాను. అప్పటి నుండి పింఛన్ ఆధారంగానే బతుకుతున్నాను.కానీ పింఛన్ తీసుకునేందుకు గతంలో చాలా ఇబ్బందులు పడేవాడిని.కానీ ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ ద్వారా మా ఇంటికే వచ్చి పింఛన్ అందిస్తున్నారు. గతంలో ప్రత్యేకంగా ఆటో కట్టించుకని పింఛన్ తీసుకోవడానికి వెళ్లే వాడిని.. పైగా అక్కడ గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. ప్రస్తుతం వలంటీర్ వ్యవస్థ వల్ల మాలాంటి వారికి ఎంతో మందికి మేలు జరుగుతుంది.



– చెల్లుబోయిన సంపతరావు, ఎన్నార్పీ అగ్రహారం.

వలంటీర్లతో ఎంతో మేలు

జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత నుండి నాకు పింఛన్ వస్తుంది. దివ్యాంగురాలునైన నాకు ప్రతీ నెల మూడు వేల రూపాయలు పింఛన్ అందుతుంది. మా ప్రాంత వలంటీర్ పి.కల్యాణి ఒకటవ తారీఖు ఉదయమే నా మంచం దగ్గరకు తీసుకువచ్చి ఇస్తుంది. మంచం మీద నుండి కిందికి దిగలేని స్థితిలో దివ్యాంగురాలునైన నేను ఆఫీసుల చుట్టూ తిరిగి పింఛన్ పొందే అవకాశం లేకుండా జగన్ మావయ్య అందిస్తున్న పింఛన్ వలంటీరు నాకు అందించడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ ప్రభుత్వ పాలనలో నాలాంటి వారిని చాలా బాగా పట్టించుకుంటున్నారు.



-కె.విజయ సాయి దుర్గ, మాదివాడ, ఆకివీడు మండలం.

వైభవంగా దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం



సామూహిక కలశ పూజలు నిర్వహిస్తున్న మహిళలు



కలశాలతో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కాళ్ల: మండలంలోని కోమటిగుంట గ్రామంలో కొలువైయున్న శ్రీ దుర్గాదేవి దేవస్థానం తృతీయ వార్షికోత్సవ కార్యక్రమాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా 108 కలశాలతో గోక్షీర సహిత పంచామృతములు, పుణ్య నది జలాలతో మహిళా భక్తులు అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించి అభిషేకం చేశారు. ఆలయ నిర్మాణకర్తలు ఎరుబండి రామాంజనేయులు, రత్నకుమారి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళా భక్తులు పాల్గొని ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ నిర్మాణకర్తల సహకారంతో అఖండ అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

వరిసాగులో వెదజల్లే పద్ధతి లాభదాయకం

ఉండి: వరిసాగు చేసేందుకు రైతులు అనుసరిస్తున్న పద్ధతుల్లో వెదజల్లే పద్ధతి అన్నింటికంటే లాభదాయకమైందని ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు అన్నారు. సోమవారం కృషి విజ్ఞానకేంద్రంలో వరిసాగులో చేపట్టే పలు పద్ధతులపై ప్రదర్శనా క్షేత్రాన్ని శాస్త్రవేత్తలు ప్రారంభించారు.ఈ సందర్భంగా వరిసాగులో వెదజల్లే పద్ధతి రైతులకు చాలా అనువైందని అన్నింటికంటే రైతుకు లాభాలు తెచ్చే పద్ధతి అని వివరిస్తూ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మల్లిఖార్జునరావు మాట్లాడుతూ ప్రస్తుతం నాలుగు పద్ధతుల్లో వరిసాగు చేపడుతున్నారన్నారు. నాట్లు వేసే పద్ధతి, బెంగాల్ ప్లాంటింగ్, డ్రమ్ సీడర్, వెదజల్లే పద్ధతిలో రైతులు వరిసాగు చేస్తున్నారన్నారు. వీటన్నింటిలో వెదజల్లే పద్ధతి రైతులకు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ పద్ధతి పాటించడం ద్వారా రూ.6 వేల నుండి రూ.7 వేల వరకు రైతులు సాగు ఖర్చు తగ్గించుకోవచ్చునని సూచించారు. ఎకరాకు 15 కేజీల విత్తనాలు చల్లుకోవాలన్నారు. చల్లుకునే ముందుగా వరిచేను బాగా చదును చేసుకుని రెండు మీటర్లకు ఒకటి చొప్పున చిన్న చిన్న దారులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.వీటివల్ల అధిక వర్షాలు వచ్చిన సమయంలో ముంపు ఇబ్బందులు ఉండవన్నారు. వెదజల్లిన 3 రోజుల నంతరం పైరజోల్ సల్ఫరాన్ ఇథైల్ అనే కలుపు మందును ఎకరాకు 80 మీ.లీ. చల్లుకోవాలని రైతులకు సూచించారు.



కేవీకేలో వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేస్తున్న దృశ్యం

ఘనంగా కాటన్ వర్ధంతి

సాక్షి, భీమవరం: గోదావరి జలాలను సక్రమైన మార్గంలో పెట్టడానికి అనకట్టలను నిర్మించి ఉభయ గోదావరి జిల్లాలకు దేవుడిగా నిలిచిన సర్ ఆర్థర్ కాటన్ రుణం తీర్చుకోలేమని ఇరిగేషన్ ఏఈ వినయ్‌కుమార్ అన్నారు. సర్ ఆర్థర్ కాటన్ వర్ధంతి కార్యక్రమాన్ని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో రెస్ట్ హౌస్ రోడ్డులోని ఇరిగేషన్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రైతు కార్యాచరణ సమితి నాయకుడు పాతపాటి మురళీరంగరాజు సహకారంతో పాఠశాలు, కళాశాలలు, ఇరిగేషన్ కార్యాలయానికి కాటన్ చిత్రపటాలను బహుకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ నందమూరి రాజేష్, కేజీఆర్ఎల్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కె సత్యనారాయణ, సీతారామరాజు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉండి: కోలమూరు 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఫీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పాములపర్రు, కోలమూరు, ఆరేడు, కలిగొట్ల, ఉప్పులూరు, పాందువ్వ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

కాళ్ల: కట్టుకున్న భార్యను వేధిస్తున్నారంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కాళ్ళ పోలీసులు కేసు నమోదు చేశారు. కాళ్ల గ్రామశివారు గాంధీనగర్‌కు చెందిన మహిళకు 2019 లో రేవు నాగేంద్రబాబుతో వివాహం అయ్యింది. కొంత కాలం బాగానే చూసుకున్న తన భర్త ఈ మధ్య కాలంలో వేధిస్తున్నాడని దీనికి అత్త సహకరిస్తున్నారని బాధితురాలు కోర్టును ఆశ్రయించింది. కోర్టు నుంచి వచ్చిన ఆదేశాల మేరకు కాళ్ల ఎస్సై ఏజీఎస్ మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కూలిరేట్లు పెరిగే వరకు పోరాటం



ఉండి ఏఎంసీలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్రాధ్యక్షుడు విల్సన్

ఉండి: కష్టపడి పనిచేసే వ్యవసాయ కూలీల రేట్లు పెరిగే వరకు సీపీఐ ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాలు చేస్తూనే ఉంటుందని శాఖ రాష్ట్రాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు.రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 25వ మహాసభను ఉండి ఏఎంసీలో సోమవారం సంఘ జిల్లా అధ్యక్షుడు సనపల శ్రీనివాస్, ఉల్లింకల జయకృష్ణ,సీహెచ్ సరోజిని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్‌లకు దోచిపెట్టడం తప్ప ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేదలను మరచిపోయారన్నారు. కార్యక్రమంలో రాష్ట్రర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.